# చాగంటి
# సోమయాజులు తో



చుట్ట వెలిగించుకుంటూ ఇంటి మొగదల ద్వారం దాటుతూ వుంటారు చాసో, ఇంతలో ఒక శాలువా కప్పుకుని మధురవాణి ఇంట్లోకి వస్తూ ఎదురవుతుంది.

**చాసో:** ఎవరూ, మధురవాణిలా వుందే!

**మధుర:** అవును, మధురవాణినే,

**చాసో:** ఏమిటి, వేళగాని వేళప్పుడొచ్చావు? నేను ''షైరు''కి వెళుతున్నాను

**మధుర:** మీరు రెండుపూట్లా రెండేసి మైళ్ళచొప్పున షైరుకి వెళతారన్నారెవరో, నిజమే అన్నమాట

**చాసో:** నాగురించి నిజమే చెప్తారు నేనూ నిజమే చెప్తాను, ఇంతకీ, ఏమిటి; ఇలా వచ్చేవు? పద; షైరుకెళ్తూ మాట్లాడుకుందాం.

**మధుర:** మీ దేవిడీ వరండా లోనూ ముందుహాల్లోనూ అయితే మనం చెప్పుకునే లాంటి కబుర్లు బాగావస్తాయి

**చాసో** : నీకెవళు చెప్పేరు?

**మధుర:** అయ్యో, చెప్పని వాళ్లంటూ ఎవరైనా ఉంటే కద! రోణంకి అప్పలస్వామి గారు, శ్రీశ్రీగారు, ఆరుద్రగారు, నారాయణ బాబు గారు, ఆ నాశర్మగారు యిలాంటి వాళ్లు ఎంతమంది మీ సావిట్లో మీతో కూర్చుని కబుర్లు చెప్పేరోట.

**చాసో:** అవును నాకూ పన్లేదు; వాళ్లలో కూడా కొందరికి పన్లేదు

**మధుర:** కానీ, అవన్నీ పనిలేని వాళ్ల కబుర్లు కావు కదా!? 1938-50 ప్రాంతంలో మీ ఇంట్లో సాగిన సాహితీ చర్చలు యవరయినా రికార్డు చేసుంటే ఒక అద్భుతమైన పుస్తకం అయ్యుండేదిట.

**చాసో:** ధనమాంద్యం భయంకరంగా ఉండిన కాలం మాకబుర్లలో కొంత నిరాశ, కొంత చిరాకూ ఉండేవి. అంచేత ఆపుస్తకం ''అద్భుతంగా'' వుండకపోగా అసహ్యంగా కూడా వుండేదేమో

**మధుర:** అసహ్యంలోంచి కవితా వొస్తువుల్ని సాధించడం మీతోనే ప్రారంభమైందేమో? మీ కవితల్లో ఆ ప్రయత్నం కొంత జరిగిందిట.

**చాసో:** నేను కవితలు రాసేనని నీ కెవళు చెప్పేరు?

మధుర: దబాయించకండి, మీరు మొదట కవిత్వమే రాసేరు అది గిట్టుబాటుకాక కథల్లోకి దిగేరు-కథలు రాసి మీరు ప్రపంచస్థాయి కథకుల్లో వొకరయ్యేరు. కవిత్వమే కంటిన్యూ చేసుంటే శ్రీశ్రీకి నెంబరు టూగానో లేకపోతే ఆరుద్రకి నెంబర్ త్రీగానో సెటిలైపోయుందురు. మీకు మాటల్లో గిమ్మిక్కులు చెయ్యడం, అనుప్రాసలూ తెలీవు, మీదంతా చెట్టుకొనరుకూ, చెంపకో దెబ్బ.

**దాశి:** ఐతే, నా కవితలు నీకు నచ్చలేదన్నమాట?

**మధుర:** అదేం మాట? మీ కవితలూ కథలే, మరింత పవర్‌ఫుల్‌గా చెప్పేరు. పవర్ ఫుల్ రచనకి ఫ్లవర్‌ఫుల్ రీడర్సు పనికిరారు. బెర్నార్డ్‌షా గారన్నట్టు మీ కవితలు సక్సెసేగాని రీడర్సే ఫేలయ్యేరు.

**దాశి:** ఏమిటి, నా కవితల్లో నువ్వుచూసిన పవరు?

**మధుర:** నే నన్నీ కంఠతా పెట్టలేదుకాని, ''కాందిశీకుడు'' అన్న మీ పోయెం నేనప్పచెప్పగల్ను.

బతకాలని వెళ్లావు ✱ బాబుల్లో పడ్డావు
బతికొచ్చినావా ✱ నానాయనా
నిరుడెల్లిపోనావు ✱ నేడొచ్చినావు
నడిసొచ్చినావా ✱ నా నాయనా
కొండలెక్కొచ్చినా ✱ కానల్లో నడిసినా
కట్టెతోటొచ్చావ ✱ నానాయనా
మారురైతుకు పోయె ✱ మనసాగు భూమిరో
మారుమనుముకుపోయె ✱ నీ బిడ్డ తల్లిరో
నేనేమిసేతురా ✱ నానాయనా
నిన్నునమ్ముకు మేము ✱ నిలబడివున్నాము
నిప్పునేకున్నాము ✱ నీకేటి పెట్టేది

ఇది కథకాక మరేమిటి?. ఈ కథ ఛాయకొంత మీ '' ఆమెత'' అనే కథలో వుంది

**దాశి:** రైటే కాబోల్లే

**మధుర:** మీరు మంచి శ్రీమంతుల కుటుంబానికే చెందినా పేదవాళ్ల బతుకుల్ని గురించి చాలా కరక్టుగా రాసేరు, ఇదెలా సాధ్యపడిందో?

**దాశి:** నేను పుట్టుకతో శ్రీమంతుణ్ణేకాను, దత్తుడినయ్యాక శ్రీమంతుల లిస్టులో చేరిపోయేను. లచ్చమ్మపేట అగ్రహారంలో మా చాగంటి వారికి బోల్డు భూమి, ఒక్కొక్క కుటుంబానికీ వందేసి యకరాలూ ఆ లెక్కలో ఉండేది. శ్రీమంతమా అంటే అది శ్రీమంతమే. కాని, ఆ భూములన్నీ ఒక్క సెంటుకూడా మిగలకుండా సాగుహక్కుల చట్టంద్వారా పోయాయి.

**మధుర:** మీరు వయసులో ఉన్న కాలంలో పల్లెటూరికి చెందిన బ్రాహ్మణ ఇనాందార్ల

అబ్బాయిలు బాగా చదువుకుని పట్టణాలలో ఉద్యోగాలకి వెళ్లేవారు. కానీ మీరు వెళ్లలేదు. అటు ఉద్యోగమూ లేకపోగా, ఇటు భూములూ దక్కకపోగా, మీమీద అప్పట్లో ఆర్థిక మాంద్యం దెబ్బ, చట్టందెబ్బ, నిరుద్యోగం దెబ్బ బలంగాపడ్డాయి.

**దాశి:** పడితే పడ్డాయిగాని, పల్లెటూర్లో నిమ్నకులాలవాళ్లు, పేదవాళ్లు, ఎలావుండేవారో దగ్గిరిసా చూడ్డానికి నాకు వీలయింది.

**మధుర:** పోయిన ఆస్తి పోతే పోయింది గాని, సివిల్ లా అంతా అరిటి పండొలిచినట్లు బోధపడ్డాది-అన్నాట్టైవడోను. పల్లెటూళ్లలో పేదవాళ్లని బాగా అబ్జర్వ్ చెయ్యడం వల్లనే ''కుంకుడాకు'' కథ అంత accurateగా వచ్చింది.

**దాశి:** అలా అని పట్నంలో పేద వాళ్లనీ నేను వదిలీ లేదు. జంతువులూ, మనుషులూ-ఏదీ కూడా నా కథల్లో స్వభావానికి అణుమాత్రం విరుద్ధంగా రాదు. గురివింద పొదకింద గోరు వంక పలికిందనీ, గోరింట చెట్టు కొమ్మలేకుండా పూసిందనీ, గోరింట కొమ్మల్లో కోయిల కూసిందనీ కవితాన్యాయంకోసమైనా రాయలేని వాణ్ణి మనుషులైనా అంతే ఏ స్థాయివాళ్లని ఆ స్థాయిలో ఆస్థలాల్లో పరిశీలించి కథలు రాసేను.

**మధుర:** అవును. మీరు రాసిన '' ఎంపు'' కథకి స్థానం మనవూళ్లో కైరేతీ సత్రవు అని స్పష్టంగా తెలుస్తుంది అమ్మబాబోయ్!' ఎంపు'' కథలో ముష్టివాళ్లద్వారా మీరు చెప్పిన Economic Theoryకి సాటి మరెక్కడా లేదు అది వొక పవర్‌ఫుల్ హ్యూమన్ డాక్యుమెంట్ కూడాను

**దాశి:** అట్టే పొగిడీకు

**మధుర:** ముష్టివాళ్లనేకాదు, దిగువమధ్యతరగతి కుటుంబాల వాళ్లనీ, ముఖ్యంగా బ్రాహ్మల్నీ మీరు స్టడీ చేసినంత బాగా యవరైనా చెయ్యగల్రా? ధనమాంద్యకాలంలో స్కూలు ఫీజులు కట్టుకోలేక చదువులు మానేసిన బ్రాహ్మల పిల్లలు పట్టణాల్లో యెంతమందో! మీరు రాసిన '' ఎందుకు పారేస్తాను నాన్నా!?'' చదివి ఆర్థిక మాంద్యం లేని ఈ కాలంలో కూడా కళ్లనీళ్లు పెట్టుకునే వాళ్లెదర్నో నేను చూసేను.

**దాశి:** అప్పట్లో బ్రాహ్మల కుటుంబాలకి బతుకుతెరువుకి చదువొక్కటే శరణ్యం. మన చాతుర్వర్ణ్య వ్యవస్థలో బ్రాహ్మడికి నిర్దేశించిన ధర్మం చదువే. ధర్మం చదువయి,యాచన కులవృత్తి అయింది. క్రమంగా పండితసత్కారాల ద్వారా రాజులు, ధన కనక వస్తువాహనాలని మనం చెప్పుకుంటున్న వాటిల్లో ఆవులో బట్టలో భూమో బ్రాహ్మలకి దఖలు పడేవి. కడుపు మాడకపోతే కవిత్వంకూడా అడుగంటి పోతుంది. కూర్చుని తింటే కొండలు కూడా కరిగిపోతాయి. అధునాతనమవుతున్న సంఘంలో; ముఖ్యంగా నగర జీవితంలో ఒకప్పటి కులవృత్తి అయిన యాచనకి అవకాశాలు తగ్గిపోయాయి. అంచేత చదువుకుంటే తప్ప మనుగడలేదు. ఇది ఇరవయ్యవ శతాబ్దపు రెండవ పాదం కాలంలో బ్రాహ్మల్లో ఉన్న పేద వాళ్లకే కాక అన్ని కులాల్లో పేదలకి కూడా సామాన్య సూత్రం అయి వర్తించింది.

ఎలాగోలా చదువు పూర్తి చేస్తే ఏదోవొక ఉద్యోగం సంపాదించుకొని బతుకుబండి ఈడ్చగలుగుతాము- అనే ఆశతో; సేద్యం చెయ్యలేక కౌలు కిచ్చిన భూముల్నీ, ఏడాది కోసారి తాటాకు మార్పించుకోడానిక్కూడా సావకాశంలేని ఇళ్లనీ కూడా అమ్మేసుకున్న బ్రాహ్మణ కుటుంబాలు ప్రతీ అగ్రహారం లోనూ ఉండేవి.

**మధుర:** అల్లుడి చదువు ధ్యేయంగా పెట్టుకుని కూతుర్ని వ్యభిచారంలోకి దింపిన తండ్రీ, పిల్లల చదువులు ధ్యేయంగా పెట్టుకుని తనే వ్యభిచారంలోకి దిగిన తల్లీ మీ కథల్లో ఉన్నారు ఆ కథలు రాసినప్పుడు మీ రెంతమానసిక వ్యధకి గురై ఉంటారోకదా?

**దాశో:** అలాంటి సెంటిమెంట్లు తీసుకురాకు. వ్యవస్థమీద చిరాకుపడ్డం, వ్యవస్థ మీద తిరుగుబాటు చెయ్యొచ్చునని సూచించడం రచయిత కర్తవ్యాలు ఈపన్లు సెంటిమెంటు పెట్టి జాలి జాలిగా రాసే కథల్తో చెయ్యొచ్చు అసహ్యంతోనూ ఆగ్రహంతోనూ కూడా చెయ్యొచ్చు. సెంటిమెంటుతో కన్నా అసహ్యంతో పవర్‌ఫుల్‌గా చెప్పొచ్చు అదే నేను చేసిన పని

**మధుర:** మరి ''ఏలూరెళ్లాలి'' మాత్రం అలా లేనట్టుంది, ఏం?

**దాశో:** ఏమీ? దాంట్లో ఏమిటొచ్చింది నీకు ఇబ్బంది?

**మధుర:** వారసుల్లేకపోతే విధవరాల్ని ''ముండని చేసి మూలని కూచోబెడుదురు '' శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలలో లాగ విధవరాలన్నది పుట్టింటికి చేరినా అత్తమామల దగ్గరే వుండిపోయినా, ఇంటెడు చాకిరీ ఆవిడమీదపడి ఏ అర్థరాత్రి దాటాకో గుప్పెడు ఉప్పుపిండి నోటకొట్టుకుని గోడవార కొంగేసుకుని పడుకునే దురవస్థ వారసుడు ఏర్పడ బట్టి మాణిక్యమ్మగారు ఏలూర్లో సొంత ఇల్లు కలిగి, వెయ్యిరూపాయల కంగోరాల మీదవడ్డీలతో సుఖంగా కాలక్షేపం చేస్తూ పిల్లాడికి కాన్వెంట్‌లో చదువు చెప్పించుకుంటోంది తొమ్మిదేళ్ల కిందట మాణిక్యమ్మగారు ఆ పొరుగు స్టూడెంటు కుర్రాణ్ణి మచ్చిక చేసుకునుండక పోతే ఆవిడపనీ అంతే

**దాశో:** అదే కదా, నాకథ!

**మధుర:** కథయితే అదే-కాని, నా కోచిన్న డవుటుంది.

**దాశో:** ఏమిటది?

**మధుర:** '' ఏలూరెళ్లాలి'' అనే కథ శృంగారానుభవస్మృతి పీఠిక- అన్నారు మీ సోమసుందర్‌గారు. అంటే ఏమిటి? అది వొక శృంగార కథేనా, కాదా?

**దాశో:** కాదు. అది ఒకానొక జీవనపోరాటం కథ మాణిక్యమ్మ ఆ ఒక్కతప్పూచేసి తన జీవితాన్ని అడవా చాకిరీ నుంచీ హైన్యం నుంచీ రక్షించుకుంది అదే, ఆ కథ.

**మధుర:** ఉద్దేశం అదే. కాని వ్యక్తీకరణ కొంచెం తేడాగా వొచ్చినట్టున్నాది, మాగురుజాడ వారు కూడా వొక సందర్భంలో ''Did I make Vice attractive?'' అని

పునర్విమర్శచేసుకున్నారు. మీరు '' ఏలూరెళ్లాలి'' కథకి అలా పునర్విమర్శ చేసుకోలేదు.

**చాసో:** చేసుకో అక్కర్లేదు. విధవరాళ్లయిన ఆడవాళ్లకి వారసుడు ఉంటేతప్ప ఆస్తిమీద హక్కురాదని ఏర్పడిన చట్టాన్ని ప్రతిఘటించడం కోసం మాణిక్యమ్మ, కుంతీదేవి లాంటి మహాపతివ్రతలు చేసిన తప్పేచేసింది. ఇందులో కొత్త తప్పేమీ లేదు.

**మధుర:** అక్కడిదాకా రైటే-కథమధ్యలో మాణిక్యమ్మగారికీ పొరుగింటి స్టూడెంట్ కుర్రాడికీ మధ్యనడిచిన ''తతంగపు'' వివరణ పద్ధతి, కథ చివర్లో '' ఆ'' కథానాయకుడు '' ఏలూరెళ్లాలి!'' అని ముక్తాయించుకొనే విధంగా పునఃకల్పించిన ఆత్మీయత ( ఆకర్షణ) బట్టి చూస్తే అప్పారావు గార్లా పునర్విమర్శ చేసుకోవలసిన అవసరం ఉందో లేదో మీకే తెలుస్తుంది.

**చాసో:** నువెన్ని చెప్పు; '' ఏలూరెళ్లాలి'' నా మంచి కథల్లో వొకటి.

**మధుర:** ''ఊహా ఊర్వశి'' మీ మరో మాస్టర్ పీస్. ఆ కథలో మీరు ప్రదర్శించిన కళాత్మకత ప్రపంచ కథానికాపటంలో ఒకొక స్థానం చూపించ గలిగినంతటిది. మీ ''వాయులీనం'' ఆనాటి తెలుగు వాళ్ల ''నిస్సహాయ-బలాత్కార'' సంగీతాభిరుచికి ఒక నికషోపలమైన నిదర్శనం. మధ్యతరగతి ఆడపిల్లలు ''పెళ్లిటెస్టు''లో నిలదొక్కు కోడానికి మాత్రమే నేర్చుకునే (వయొలిన్) సంగీతం క్రమంగా యెలా వాయువులో లీనం అయిపోగలదో ఆ కథ అత్యంత విషాదాత్మకంగా చెప్పింది ఇవే పరిస్థితులు ఇంకేదేశంలోనూ ఉండకపోవచ్చు; కాని, ఇదే కథ ఇంకొక దేశంలో రాసివుంటే ఆ రచయిత యావత్ప్రపంచం నుంచీ నివాళులందుకుని ఉండేవాడు

**చాసో:** సౌజన్యారావు పంతులు గారన్నట్టు ఎవరోనా శత్రువులు నిన్ను నాదగ్గరికి పంపించినట్టున్నారు అన్నీ నాకు నచ్చని విషయాలే మాట్లాడుతున్నావు

**మధుర:** మీకు సాధారణంగా ఎవరి కథలూనచ్చవట ఒక్కొక్కప్పుడు మీవే మీకు నచ్చవట-అలాగని మీ సప్తతి సంచికలో సంపాదకీయంలో మీ శిష్యుడు రాసేడు

**చాసో:** నాకెవరూ శిష్యుల్లేరు వారసులు మాత్రం ఉన్నారు.

**మధుర:** ఐదుగురు పిల్లలు పుట్టేరు, మీకు వారసుల్లే రని యెవరంటారు?

**చాసో:** ఆ వారసుల మాటకాదు, నేనన్నది! నేను ఆస్తులు సంపాదించనూ లేదు; అంతకి ముందున్న ఆస్తిని కాపాడుకోనూలేదు; వారసుల కప్పజెప్పడానికి. ..నేనన్నది సాహితీ వారసులమాట. మా అమ్మాయి తులసీ, మా అబ్బాయి శంకరం; నా సాహితీ వారసులు.

**మధుర:** మీరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా పూసపాటి కృష్ణం రాజుగారు, రామగోపాలం మీ శిష్యులమని చెప్పుకున్నారు. కృష్ణంరాజైతే మీ సాహితీ వారసుడని రామగోపాలం అంటున్నాడు.

**చాసో:** ఎవరభిప్రాయం వాళ్లది. కృష్ణంరాజు నాసాహితీ వారసుడేమిటి, గోపాలానికి మతిలేక గాని!

**మధుర:** కృష్ణంరాజు కథాకథనశైలి మీ నుంచి పుణికి పుచ్చుకున్నట్టు ఉందిట; రామగోపాలం రాసిన కథల్లో మూడు డజన్లదాకా బావులేవని చెప్పి మీరు చింపేసేరుట.

**దాశి:** అలా చింపేకపోతే అతను ఈ మాత్రం రైటరుకూడా అయ్యుండేవాడుకాదు వీళ్లిద్దరూ కూడా మా తులసి రాసిన ''బొమ్మ రూపాయి'' తో పోల్చదగిన కథ రాయలేదు.

**మధుర:** ఎటువంటి కథైనా సరే నచ్చని మీకు, మీ అమ్మాయి కథ నచ్చడం లో ఏదో విశేషం వుంది.

**దాశి:** నువ్వంటున్న దేమిటో నా కర్థమైంది. తులసి మా అమ్మాయి కాకపోయినా నేనీమాట అంటాను నాకు నచ్చిన కథల్తో నేను ''కళింగ కథానికలు'' అని ఓ పుస్తకం వేసేను. అందులో కూడా ఇదే సూచన చేసేను

**మధుర:** మీకు ఆస్తిమీద లేనట్టే కుటుంబం మీద కూడా అంతశ్రద్ధ లేదని అంటారు. ''ఊహా ఊర్వశి'' కథలో కాబోలు ''రాత్రికి ఏం వండమంటారు?'' అని భార్య అడిగిన ప్రశ్నకి భర్త చెప్పిన జవాబు అక్షరాలా మీ నోటి వెంట ఊడిపడిందని మనవూళ్లో చాలా మంది చెప్పేరు.

**దాశి:** మరి వాళ్లు ''చిన్నాజీ '' కథలో నా Fine feelings గురించి చెప్పలేదుకాబోలు మా అమ్మాజీ, చిన్న, బాబి, పాపాయి, శంకరం వీళ్లందర్నీ నేను ప్రేమించినట్టూ దగ్గరికి తీసుకున్నట్టూ సాహిత్యమే జీవితంగా గడిపిన ఎవ్వరూ కూడా చెయ్యలేదు. ఆసంగతి నీతో యవళూ అన్లేదా? నా పిల్లలు గాని మా ఆవిడగాని నా absence బాగా అనుభవించినా నన్ను వాళ్లు ఎప్పుడూ miss కాలేదు. నెలలతరబడినేను సాహిత్య యాత్రల్లో గడిపేను

**మధుర:** మీరు సాహితీ యాత్రలన్నవి నిజంగా సాహితీ యాత్రలు కావుట.

**దాశి:** అదేమిటది, మళ్లాను?

**మధుర:** ఏదో ఫలానా సాహిత్య సభలవుతున్నాయనో, లేకపోతే మీకే ఏదైనా సన్మానం చేస్తారనో ప్రకటించకపోయినా మీరు ఇల్లు విడిచి బైలుదేరడం చాలా సార్లు జరిగిందిట. ఏమీ తోచక పోతే ఏదో నెపం పెట్టుకుని ఎక్కడికో వెళిపోయేవారుట.

**దాశి:** అలా వెళ్లిన సందర్భాలూ వున్నాయి. అలాంటి వో సందర్భంలో మెద్రాసు వెళ్లినప్పుడు వుప్పులూరి కాళిదాసుగారు నన్ను '' ఆనందవాణి'' (వీక్లీకి) ఎడిటర్గా పెట్టేసుకున్నాడు. ఏపూట ఎక్కడ భోజనమో ఏరాత్రి ఎక్కడనిద్రో ఏమీ తెలీకుండా గడిపేను. కొన్నాళ్లు శ్రీశ్రీ ఇంట్లో గెస్టుగా వున్నాను. అది లేమికాదు. సరదా. ఇష్టమైన పనిచేస్తున్నాం కదా అన్న తృప్తితో చారూ అన్నం తింటూ చాపమీద పడుకుంటే కూడా తేడా తెలిసేది కాదు. చుట్టలూ కాఫీటిఫిన్లూ కాళిదాసే ఏర్పాటు చేసేవాడు.

**మధుర:** చాలారోజులు సినిమా కంపెనీల వాళ్లూ అలాగేటగా? రూమ్ రెంటూ, కేరియరూ, సిగరెట్లూ; ఇంకా కావల్సిన వాళ్లకే మందూ-సరఫరా చేసి డబ్బు అసలేమీ యివ్వకుండా

స్క్రిప్టులు రాయించేసుకొనేవారుట. వారందరూ కాళిదాస శిష్యవర్గం అయ్యుంటారు. అది సరే; అదంతా 1950నాటి మాట. 1967-68లో కూడా మీరు బెజవాడెళ్లి వారాలతరబడి ఉండిపోయే వారుట

**రావిః** అప్పుడు బెజవాడ్లో పురాణం, నండూరి రామ్మోహన్రావు, రాఘవయ్య, మారుతీ రావు, వీరాజీ ఇలా ఎందరో ఉండేవారు. వాళ్లకోసం పైవూళ్లనించి బోల్డు మందొచ్చేవాళ్లు.

**మధుర:** బోల్డు 'మందు' కూడానా?

**రావిః** అప్పుడు మందు లేదు. నిషేధం వుంది.

**మధుర:** నిషేధం ఎత్తేసేక కూడా మీరు మందు ముట్టుగోలేదుట కదా.

**రావిః** నామట్టూ నా అభిమానులూ, నా సహచరులూ ఎందరోకూర్చుని ఏమిటేమిటో తాగినా నేను చుట్ట మాత్రంతాగి సంతృప్తి పడే వాణ్ణని ఎవరో ఎక్కడో రాసేరు.

**మధుర:** మీ కబుర్లు నిష్కర్షగా వున్నా వినడానికి అందరూ యిష్టపడేవారుట.

**రావిః** నాకబుర్లు సాహిత్యాభిమానులకీ రచయితలకీ ఎడిటర్లకీ ఇష్టంగానే ఉండేవి. కాని నా పిల్లలకి మరీ యిష్టంగా వుండేవి నా పిల్లలు నాదగ్గిర బతికారు గాని వాళ్ల తల్లిదగ్గిర పెరిగిన వాళ్లు కారు. నా సంసారం ఒకనదిలా నిశ్శబ్దంగా ప్రవహించుకుంటూ పోయింది. నేను ఇంట్లో వున్నప్పుడు మాత్రం ''కొండగెడ్డ'' లా చప్పుడు చేస్తూ నడిచింది.

**మధుర:** కానీ, మీ కుటుంబ చరిత్ర గొప్ప గొప్ప ట్రాజెడీల సమ్మేళనమైపోయింది

**రావిః** భౌతిక వాదులు జాతి విపత్తులకీ లోక విపత్తులకీ స్పందించినంతగా వ్యక్తి విపత్తులకీ కుటుంబ విపత్తులకీ స్పందించరు.

**మధుర:** మీరు భౌతిక వాది కాబట్టే మీ కళ్లు దానం చేసి మీ శరీరాన్ని మెడికల్ కాలేజీల్లో వుపయోగించడం కోసం వుంచమన్నారు.

**రావిః** శ్రీశ్రీకూడా అలాగే ఉద్దేశించాడు. కాని, కుటుంబ సభ్యులూ విప్లవం వాళ్లూ కలిసి; పడకుండా చేసేరు.

**మధుర:** మీకు విప్లవం వాళ్లంటే పడదా?

**రావిః** విప్లవం వాళ్లకే నేనంటేపడదు

**మధుర:** ఎంచేతో?

నా రచనల్లో స్లోగన్లు ఉండవు. నేను బోధించిన తిరుగుబాటులో డైరెక్ట్ యాక్షన్ కన్నా ఆలోచనకి ఎక్కువ ప్రాధాన్యం. ఆ విభేదం సిద్ధాంత పరమైంది కాదు; మనోగతమైనది. తీవ్రవాదం, తీవ్రచర్య; చాలాసందర్భాల్లో విధ్వంసానికి దారితీసి, వాటివల్ల సంభవిస్తుందనుకున్న మేలు మరుగుని పడిపోతుంది. అంచేత తిరుగుబాటు ధోరణులలో అభ్యుదయ-విప్లవ-అని రెండు ఏర్పడ్డాయి.

**మధుర:** కాని, అభ్యుదయ వాదులు మితవాదులుగా ఉండిపోయి చివరికి ఛుప్కువాదుల య్యారని వాళ్లంటారు.

**దాశి:** నీదంతా కష్టవాదం.

**మధుర:** చుట్టకాల్చడం కూడా కష్టవాదమే కదా. గిరీశంగారు కూడా చుట్టలు లావుగా కాల్చేవారు.

**దాశి:** గిరీశానికి చుట్ట కాలక్షేపమే. కానీ నాకు మాత్రం చుట్ట అనేది వొక సంకేతం; ప్రతీక. నావి కొన్నివందల ఫోటోలు తీసేరు; కాని చుట్టలేకుండా ఒక్కటీ వుండదు చూసుగో.

★